క్లుప్తంగా

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

అచ్చంపేట: మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వడంపై మండల బ్రాహ్మణ ఐక్య వేదిక హర్షం వ్యక్తం చేసింది. శనివారం అచ్చంపేటలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక ప్రతినిధి అనిల్‌శాస్త్రి, సభ్యులు ఉప్పల శ్రీనివాసమూర్తి, టీవీఎస్ మల్లికార్జునరావు, ముప్పాళ్ల నిత్యానందశర్మ తదితరులున్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

క్రోసూరు: రైతు, కార్మిక ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆల్ ఇండియా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు జరిగిన ఈ సమావేశానికి కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ నెల 16న జరగనున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో పోరాటం చేసిన రైతులతో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి రెండేళ్లు అవుతున్నా.. ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు జి.రవిబాబు, రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచేటి పెద్దబ్బాయి , సీఐటీయూ మండల కార్యదర్శి గర్నేపూడి మహేష్ ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల హర్షం

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం 2012 నుంచి పెండింగ్‌లో ఉన్న ఐసీడీఎస్ కమీషన్ నిధులు విడుదల చేయడంతో శనివారం మండల ప్రజా పంపిణీ రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పాశం శ్రీనివాసరెడ్డి, 43 మంది డీలర్లు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

తహసీల్దారుకు శుభాకాంక్షలు

క్రోసూరు: తహసీల్దారుగా బాధ్యతలు తీసుకున్న ఎం.సువర్ణను శనివారం ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, రేషన్ డీలర్లు కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పాశం శ్రీనివాసరెడ్డి, డీలర్లు సోమమస్తాన్‌రెడ్డి, కృష్ణంరాజు, వెలదిఅప్పారావు ఉన్నారు.

ప్రజారోగ్యమే పరమావధి

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారు. సీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, పట్టణ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేసి, అన్ని వర్గాల ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.

- పట్టణ పేదలకు ఆరోగ్య భరోసా
- వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం
- మూడు ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత భవనాలు
- రెండు భవనాల నిర్మాణం పూర్తి, చివరి దశకు మరొకటి
- రూ. 2.40 కోట్ల నిధులు మంజూరు



వెంగళరెడ్డి నగర్‌లో నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్



ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద ముమ్మరంగా వైద్యశాల నిర్మాణ పనులు



ఏఎంసీ వెనుక వైపు ప్రారంభానికి సిద్ధంగా డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

సత్తెనపల్లి: పట్టణ పేదలకు అత్యాధునిక నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు జన సాంద్రతను బట్టి అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు కూడా పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా వైద్య సేవలు అందుతున్నాయి.



విలేజ్, అర్బన్ హెల్త్ సెంటర్ల ఏర్పాటుతో పాటు నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసి, 108, 104 సేవలను సీఎం వైఎస్ జగన్ బలోపేతం చేశారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం, ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్య సురక్ష వంటి కార్య క్రమాలు చేపట్టారు. ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ. 25 లక్షల వరకు పెంచడంతోపాటు మరిన్ని వ్యాధులకు ఉచితంగా చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు.

అందుబాటులో వైద్యులు..

డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ముఖ్యంగా ఆయా ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచింది. మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బందిని నియమించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి ల్యాబ్ టెస్ట్ చేసి, సంబంధిత వ్యాధికి అవసరమైన చికిత్సను అందిస్తున్నారు. అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో ఓపీ పెరగడం మెరుగైన వైద్య సేవలకు అద్దం పడుతోంది. అలాగే ప్రతి ఆరోగ్య కేంద్రంలో 10 పడకలతో ఇన్ పేషెంట్ విభాగం, 63 రకాల ల్యాబ్ వైద్య పరీక్షలు, 172 రకాల మందులు అందుబాటులో ఉంచారు.

ప్రతి కేంద్రానికి శాశ్వత భవనం

అర్బన్ హెల్త్ సెంటర్లకు సొంత భవనాలు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తొలుత వాటిని అందుబాటులో ఉన్న భవనాల్లో ప్రారంభించి, వైద్య సేవలు ప్రారంభించినా.. క్రమంగా నిధులు కేటాయించి సొంత భవనాలను సమకూరుస్తోంది. సత్తెనపల్లిలో మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు భవన నిర్మాణాలు చేపట్టింది. ఒక్కో భవనానికి రూ. 80 లక్షలు చొప్పున మూడు భవనాల నిర్మాణానికి రూ.2.40 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వెనుక వైపు రెండు భవనాలు నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. వెంగళరెడ్డి నగర్‌లోని మరో భవనం 80 శాతం పూర్తయ్యింది. ఆ భవనం కూడా త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పట్టణ పేదలకు మరింత ప్రయోజనం



రాష్ట్ర ప్రభుత్వం వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసింది. అవసరమైన వైద్య సిబ్బందిని నియమించి, మందులు కూడా అందుబాటులో ఉంచింది. చిన్నపాటి వ్యాధులకు కూడా పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. రెండు అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాల ప్రారంభోత్సవం త్వరలోనే జరగనుంది.

– కొలిమి షమ్మి,
మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి.

చింత చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి: చింత చెట్టుపై నుంచి ప్రమాదవ శాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని 31వ వార్డులో శనివారం జరిగింది. వివరాల మేరకు.. పట్టణంలోని 31వ వార్డు అంబేడ్కర్ నగరకు చెందిన పసుపులేటి నాగరాజు (38)వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నాడు. చింత చెట్టుపై చింతకాయల కోస్తూ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలై మృతి చెందాడు. నాగరాజు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. భార్యను హత మార్చిన కేసులో మృతుడు ముద్దాయిగా ఉన్నాడు. అతనికి 13 ఏళ్ల కుమార్తె ఉంది.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రూపవతి

ముప్పాళ్ళ: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఈఓపీఆర్డీ ఎస్.రూపవతి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు జెడ్పీ కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలు అందాయి. ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తల చేరిక

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: చెరుకుంపాలెం గ్రామానికి చెందిన నాలుగు వడియరాజుల కుటుంబాలు టీడీపీ వీడి.. వైఎస్సార్ సీపీలో శనివారం చేరాయి. క్రోసూరులోని తన కార్యాలయానికి వారందరికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులైన అనేక మంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పు తిరుపతిరావు, ఉప్పు శ్రీను, యల్లమందయ్య, కొండమ్మ తదితర కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ చింతగుంట్ల హనుమంతురెడ్డి, చల్లా శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ యల్లమందయ్య ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే శంకరరావు పర్యటన

క్రోసూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రాంగణంలో జరిగే లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వ డిపూజా కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం ఎమ్మె ల్యే నంబూరుశంకరరావు పాల్గొంటారని ఎమ్మెల్యే వక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయాలు ప్రారంభం

అమరావతి/అచ్చంపేట: అమరావతి, అచ్చంపేట మండలాల వైఎస్సార్ సీపీ కార్యాలయాలను ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆయా మండలాల పార్టీ అధ్యక్ష, కన్వీనర్లు భవిరిశెట్టి హనుమంతరావు, చిల్కా చంద్రయ్య శనివారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

నేడు బూత్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమావేశం

బెల్లంకొండ: మండలంలో ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటించనున్నట్లు ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిరాజుపాలెంలో మాజీ ఎంపీటీసీ శివ కుమార్తె వివాహ కార్యక్రమానికి హాజరవుతారని, మండల కార్యాలయంలో వివిధ గ్రామాల బూత్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్నీ గ్రామాల నాయకులు సమావేశంలో పాల్గొనాలని తెలిపారు.

ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక భేటీ..

క్రోసూరు: ఎన్నికల విధుల్లో భాగంగా ఇటీవల బదిలీలపై వచ్చిన పోలీసు అధికారులు శనివారం క్రోసూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథబాబు, పెదకూరపాడు సీఐ జి.మంగారావు, అమరావతి సీఐ ఏవీ బ్రహ్మం, క్రోసూరు ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు.

విశ్రాంతి, ధ్యానంతో సుఖ ప్రసవం

సత్తెనపల్లి: ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు హెల్ప్ ఫౌండేషన్ అమ్మ కోసం కార్యక్రమం పేరుతో శ్రీ విద్యా లెర్నింగ్ సెంటర్, శివశక్తి ట్రస్ట్ సహకారంతో శనివారం పౌష్టికాహారం అందజేశారు. వైద్యాధికారిణి డాక్టర్ యూఎస్ఎల్ కవిత మాట్లాడుతూ సుఖ ప్రసవం జరగాలంటే తగినంత విశ్రాంతి, ధ్యానం, నడక అవసరమన్నారు. ప్రధానమంత్రి సుర్కక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, డాక్టర్ ప్రదీప్, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లి బాబు, ఆరోగ్య సిబ్బంది సీతారావమ్మ, వరలక్ష్మి, సంపూర్ణదేవి, ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, విజయ్, గర్భిణులు పాల్గొన్నారు.



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న వైద్యులు

నేడు వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

అచ్చంపేట: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో భాగంగా స్థానిక దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యుడు సురే వెంకట సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు వేలాదిగా తరలి రావాలని పేర్కొన్నారు.